సాక్షి
రంగారెడ్డి
శనివారం : 8 : జూన్ : 2024



రైతులకు అందని రాయితీ

రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని ప్రకటనలు గుప్పిస్తున్న ప్రభుత్వాలు క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవడం లేదు. 8లో▸



మూగజీవాలు మృత్యువాత

పిడుగుపాటుకు జిల్లాలోని పలు గ్రామాల్లో మూగజీవాలు మృత్యువాత పడ్డాయి. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 8లో▸



పర్యావరణ పరిరక్షణ బాధ్యత

పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యతని రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డు సభ్యుడు చింపుల సత్యనారాయణరెడ్డి అన్నారు. 8లో▸

న్యూస్‌రీల్

గూగుల్‌ను నమ్మొద్దు.. భక్తులు బాలాజీని నమ్మండి

చిలుకూరు బాలాజీ దేవాలయం అర్చకుడు రంగరాజన్



గూగుల్‌ను నమ్మొద్దంటూ భక్తులకు వివరిస్తున్న అర్చకుడు రంగరాజన్

మొయినాబాద్‌: చిలుకూరు బాలాజీ దేవాలయానికి వచ్చే భక్తులు గూగుల్‌ను నమ్మకండి.. దాన్ని నమ్మితే హుస్సేన్‌సాగర్‌లోకే పోతామని అర్చకుడు రంగరాజన్‌ అన్నారు. శనివారం, ఆదివారం చిలుకూరు బాలాజీ దేవాలయం క్లోజ్డ్‌ (మూసివేత) అంటూ గూగుల్‌లో పెట్టడంపై శుక్రవారం ఆయన తీవ్రస్థాయిలో మండిపడ్డారు. చిలుకూరు దేవాలయం శనివారం, ఆదివారం క్లోజ్డ్‌ అని గూగుల్‌ వాడికి ఎవరు చెప్పారని ప్రశ్నించారు. భక్తులెవరూ గూగుల్‌ ప్రచారాన్ని నమ్మొద్దన్నారు. గూగుల్‌ని నమ్మితే శనివారం, ఆదివారం భక్తులెవరూ చిలుకూరుకు రాలేరన్నారు. 4జీ, 5జీని నమ్మితే అధోగతి అని.. భక్తులు బాలాజీని నమ్మాలని చెప్పారు. నిన్ను ఎవరడిగారు అప్‌డేట్స్‌ అని భక్తులంతా గూగుల్‌ వాడికి మెసేజ్‌ పెట్టాలని సూచించారు.

రైతులు రశీదులు మరవొద్దు



యాచారం పీఏసీఎస్‌లో రికార్డులను తనిఖీ చేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి

యాచారం: ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు రశీదులు మర్చిపోవద్దని జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి సూచించారు. మండల కేంద్రంలోని పీఏసీఎస్‌, ఆగ్రో రైతు సేవా కేంద్రాల్లో శుక్రవారం ఆమె తనిఖీలు చేపట్టారు. ఏఏ ఎరువులు ఉన్నాయి, విత్తనాలు నాణ్యమైనవే నిల్వ ఉంచారా.. ధరల పట్టిక ఉందా, రికార్డులు నమోదు చేస్తున్నారా.. తదితర వివరాలపై రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వర్షాలు కురుస్తున్న దృష్ట్యా ఆయా గ్రామాల్లో మెట్ట పంటల విత్తనాలేస్తున్నారని తెలిపారు. వ్యాపారులు నాణ్యమైన విత్తనాలను రైతులకు విక్రయించాలని అన్నారు. ధరల పట్టిక దుకాణాల ముందే రైతులకు కనిపించేలా ఉంచాలని ఆదేశించారు. పత్తి విత్తనాల విషయంలో రైతులు జాగ్రత్తగా కొనుగోలు చేయాలని సూచించారు. జిల్లాలో రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు సిద్ధంగా ఉన్నాయని స్పష్టం చేశారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సందీప్‌కుమార్‌ ఉన్నారు.

పేదింటిలో 'నవ్య' కాంతులు

- నీట్‌లో సర్కారు బడి విద్యార్థిని సత్తా
- 720కిగాను 637 మార్కులతో ప్రతిభ



నవ్య

తలకొండపల్లి: పేదింటి బిడ్డ నీట్‌లో ప్రతిభ చూపింది. వైద్య విద్య అర్హత పరీక్షల్లో సీటు సాధించి పలువురితో అభినందనలు అందుకుంటోంది. 1వ తరగతి నుంచి ఇంటర్మీడియట్‌ వరకు ప్రభుత్వ విద్యాలయాల్లో చదివి నవ్య ఇటీవల ప్రకటించిన నీట్‌ ఫలితాల్లో సత్తా చాటింది. మండల పరిధిలోని వెంకట్రావ్‌పేట్‌ గ్రామానికి చెందిన చప్పిడి హుస్సేన్‌, బాలమణి దంపతుల కూతురు నవ్య. తల్లిదండ్రులు వ్యవసాయం చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన నవ్య చిన్ననాటి నుంచి ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివింది. 1నుంచి 5వ తరగతి వరకు వెంకట్రావ్‌పేట్‌ ప్రభుత్వ పాఠశాలలో, 6నుంచి 10వ తరగతి వరకు కీసర గురుకుల పాఠశాలలో చదివింది. పాల్మాకులలోని మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల కళాశాలలో ఇంటర్‌ పూర్తి చేసింది. తల్లిదండ్రుల కష్టానికి తగిన ప్రతిఫలం ఇవ్వాలనే లక్ష్యంతో ముందుకు సాగింది. ఇటీవల విడుదలైన నీట్‌ ప్రవేశ ఫలితాల్లో 720కి గాను 637 మార్కులతో మెడిసిన్‌లో సీటు సాధించింది. ఈ సందర్భంగా ప్రజాసంఘాల నాయకులు, ప్రెస్‌ క్లబ్‌ ఆధ్వర్యంలో నవ్యతో పాటు ఆమె తల్లిదండ్రులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ముదిరాజు సంఘం మండల అధ్యక్షుడు బోళ్ల యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

మోక్షమెప్పుడో?



ఇప్పటివరకు మార్కెట్‌ ఏర్పాటు చేయకపోవడంతో ఖాళీగా ఉన్న స్థలం

కోహెడ.. ఏదీ మార్కెట్‌ జాడ?

- నాలుగేళ్లు గడిచినా ప్రారంభం కాని పనులు
- ఈ భూములను ఐటీకిచ్చే యోచనలో ప్రభుత్వం
- మార్కెట్‌ ఏర్పాటుపై కమ్ముకున్న నీలినీడలు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: కోహెడ పండ్ల మార్కెట్‌పై నీలినీడలు కమ్ముకున్నాయి. అంతర్జాతీయ ప్రమాణాలు, అత్యాధునిక హంగులతో 198 ఎకరాల విస్తీర్ణంలో కోల్డ్‌ స్టోరేజీలు, భారీ షెడ్లు ఏర్పాటు చేయాలని భావించినా.. ఇప్పటి వరకు ఆ భూమిలో తట్టెడు మట్టి కూడా తీయలేదు. అప్పటి ప్రభుత్వం రూ.350 కోట్ల రుణం మంజూరు చేయించినప్పటికీ పనులకు శంకుస్థాపన చేయలేదు. కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ ప్రభుత్వం ఓఆర్‌ఆర్‌కు ఆనుకుని ఉన్న ఈ భూములను ఐటీ పరిశ్రమలకు కేటాయించాలనే ఆలోచన చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఇప్పటి వరకు మాదాపూర్‌, మణికొండ, కొండాపూర్‌, శేరిలింగంపల్లి, నార్సింగి, కోకాపేటలకే పరిమితమైన ఐటీ, అనుబంధ పరిశ్రమలను తూర్పునకు విస్తరించడం ద్వారా ఆయా ప్రాంతాలు కూడా అభివృద్ధి చెందే అవకాశం లేకపోలేదని భావిస్తోంది. ఇదే జరిగితే అత్యాధునిక మార్కెట్‌ నిర్మాణం ప్రశ్నార్థకంగా మారే అవకాశం ఉంది.

తాత్కాలిక షెడ్లు ఏర్పాటు చేసి..

నగరంలో పండ్ల మార్కెట్‌ తొలుత మొజంజాహీ మార్కెట్లో ఉండేది. 1986లో దీన్ని ఖాళీ చేయించి 22.05 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన గడ్డిఅన్నారం మార్కెట్‌కు తరలించారు. ఒకప్పుడు నగరానికి దూరంగా ఉన్న ఈ మార్కెట్‌.. నగరం అభివృద్ధి చెందడంతో చుట్టూ నివాసాలు వెలిశాయి. వాహనాల రాకపోకలతో రద్దీగా మారింది. నిత్యం ట్రాఫిక్‌ సమస్య తలెత్తేది. ఈ క్రమంలో గడ్డిఅన్నారం పండ్ల మార్కెట్‌ను ఖాళీ చేయించి కోహెడకు తరలించాలని అప్పటి ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు 2018లోనే 163 ఎకరాల స్థలాన్ని కూడా సేకరించి మార్కెటింగ్‌ శాఖకు అప్పగించింది. ఆ తర్వాత మరికొంత స్థలాన్ని కూడా సేకరించి మొత్తం 198 ఎకరాలు మార్కెటింగ్‌ శాఖకు అప్పగించింది. అప్పట్లో రూ.20 లక్షలు ఖర్చు చేసి తాత్కాలిక షెడ్లు కూడా ఏర్పాటు చేసింది. రైతులు, కమీషన్‌ ఏజెంట్లను బలవంతంగా ఖాళీ చేయించి, కోహెడకు తరలించింది. 2020 మే4న భారీ ఈదురు గాలులతో కూడిన వర్షానికి రేకుల షెడ్లు కుప్పకూలాయి. దీంతో మళ్లీ కొత్తపేటలోని మార్కెట్లోనే కొనుగోళ్లు నిర్వహించారు.

రోడ్డున పడిన ఏజెంట్లు, వ్యాపారులు

ఉస్మానియా, గాంధీ ఆస్పత్రులకు రోగుల రద్దీ పెరగడంతో ప్రత్యామ్నాయంగా నగరం చుట్టూ మరో నాలుగు సూపర్‌ స్పెషాలిటీ ఆస్పత్రులను నిర్మించాలని గత ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు 22.05 ఎకరాల మార్కెట్‌ స్థలాన్ని ఆస్పత్రికి కేటాయించింది. కోవిడ్‌ సమయంలో మార్కెట్‌ను బలవంతంగా మూసివేసింది. రైతులు, కమీషన్‌ ఏజెంట్లు, వ్యాపారులు ఆందోళన చేసినా వెనక్కి తగ్గకుండా బలవంతంగా వారిని అక్కడి నుంచి ఖాళీ చేయించింది. అప్పటి వరకు కోహెడలో మార్కెట్‌ ఏర్పాటు చేయకపోవడంతో ప్రత్యామ్నాయంగా బాటసింగారం లాజిస్టిక్‌ పార్కులోని 11 ఎకరాల విస్తీర్ణంలో తాత్కాలిక ఏర్పాట్లు చేసి మార్కెట్‌ను తరలించింది. భారీ పోలీసు భద్రత మధ్య మార్కెట్‌లోని భారీ షెడ్లను సైతం నేలమట్టం చేసింది. 27 అంతస్తుల ఆస్పత్రి భవనానికి శంకుస్థాపన చేసి నిర్మాణ పనులు కూడా చేపట్టింది. కోహెడ్‌ మార్కెట్‌ కోసం కేటాయించిన స్థలంలో మాత్రం ఇప్పటి వరకు అడుగు ముందుకు పడలేదు. ప్రభుత్వ చర్యలతో అప్పటి వరకు మార్కెట్‌నే నమ్ముకుని బతికిన కమీషన్‌ ఏజెంట్లు, వీధి వ్యాపారులు ఆ తర్వాత చెట్టుకొకరు, పుట్టకొకరు అన్నట్లు రోడ్డున పడాల్సి వచ్చింది.

స్కూటీపై 'మంట'

- తరచూ ఇబ్బంది పెడుతోందని ఆగ్రహం
- పెట్రోల్‌ పోసి తగలబెట్టిన యజమాని



వాహనాన్ని తగలబెట్టుకున్న రఫీక్‌

చేవెళ్ల: తరచూ రిపేర్‌తో ఇబ్బంది పెడుతోందనే కోపంతో ఓ వ్యక్తి తన ద్విచక్ర వాహనంపై పెట్రోల్‌ పోసి నిప్పంటించాడు. ఈ సంఘటన చేవెళ్ల మండల కేంద్రంలో చోటుచేసుకుంది. స్థానికులు, సదరు వ్యక్తి తెలిపిన వివరాల ప్రకారం.. సరూర్‌నగర్‌లో ఉండే రఫీక్‌ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. తన అవసరాలకు ఉపయోగపడుతుందని ఇటీవల యాక్టీవా వాహనాన్ని కొన్నాడు. ఇది తరచూ మొరాయించడంతో ఇప్పటికే పలుమార్లు రిపేర్‌ చేయించాడు. శుక్రవారం ఉదయం స్కూటీపై కొండగల్‌కు వెళ్తుండగా చేవెళ్ల సమీపంలో మళ్లీ ఆగిపోయింది. దీంతో ఏం చేయాలో తోచక వాహనాన్ని అక్కడే వదిలేసి చేవెళ్లకు వచ్చి మెకానిక్‌ను తీసుకెళ్లాడు. రిపేర్‌ కోసం రూ.7 వేలు ఖర్చవుతుందని చెప్పడంతో ఇప్పటికే దీనికి రూ.12 వేలు పెట్టి బాగు చేయించా.. అయినా మళ్లీమళ్లీ సతాయిస్తోందని అని విసుగు చెందాడు. తిరిగి పట్టణానికి వచ్చి బాటిల్‌లో పెట్రోలు తీసుకుని స్కూటీ వద్దకు చేరుకున్నాడు. వాహనంపై పెట్రోల్‌ పోసి తగలబెట్టాడు. ఇది గమనించిన స్థానికులు ప్రశ్నించడంతో అసలు విషయం చెప్పాడు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని ఆరా తీయగా.. టీఎస్‌ 07 జీఆర్‌ 8361 అనే యాక్టీవా రఫీక్‌ పేరునే ఉందని గుర్తించారు. ఏ పని కోసం బయటకు వెళ్లినా మధ్యలోనే ఆగిపోతోందనే కోపంతో తగలబెట్టినట్లు పోలీసులకు చెప్పాడు. దీంతో ఈ విషయంలో ఎవరి ప్రమేయం లేదని రఫీక్‌తో రాయించుకున్న పోలీసులు అతన్ని వదిలేశారు. రిపేర్‌కు వచ్చిన స్కూటీకి నిప్పు పెట్టడం ఏమిటని స్థానికులు అవాక్కయ్యారు.



పెట్రోల్‌ పోసి తగలబెట్టడంతో పూర్తిగా కాలిపోయిన స్కూటీ

పదవి ఉన్నా లేకున్నా ప్రజల్లోనే ఉంటా

చేవెళ్ల మాజీ ఎంపీ డాక్టర్‌ రంజిత్‌రెడ్డి

చేవెళ్ల: పదవి ఉన్నా లేకున్నా ఎప్పటికీ ప్రజల్లోనే ఉంటూ వారికి సేవ చేస్తానని చేవెళ్ల మాజీ ఎంపీ డాక్టర్‌ గడ్డం రంజిత్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో తనకు ఓటేసిన ప్రతి ఒక్కరికీ, తనకోసం అహర్నిశలు పనిచేసిన పార్టీ నాయకులు, కార్యకర్తలకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఎన్నికల్లో గెలుపు ఓటములు సహజమన్నారు. ఎన్నికల ఫలితాలు తమ అంచనాలకు భిన్నంగా వచ్చాయన్నారు. పార్టీకోసం, తన కోసం పనిచేసిన నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటానని చెప్పారు. ఫలితాలపై ఎవరూ చింతించాల్సిన పని లేదని.. ప్రజలకు మరింత చేరువయ్యేందుకు కృషి చేద్దామని సూచించారు. ఫీనిక్స్‌ పక్షిలా కింది నుంచి పైకి వస్తామని ధీమా వ్యక్తం చేశారు. వారంరోజుల పాటు వ్యక్తిగత పనులపై అందుబాటులో ఉండడం లేదని, వారం తరువాత మళ్లీ ప్రజాసేవలో ఉంటానని వెల్లడించారు.

పొరపాట్లకు ఆస్కారం ఇవ్వొద్దు

- గ్రూప్‌–1 ప్రిలిమినరీ పక్కాగా నిర్వహించాలి
- అదనపు కలెక్టర్‌ ప్రతిమాసింగ్‌

సాక్షి, రంగారెడ్డిజిల్లా: గ్రూప్‌– ఐ ప్రిలిమినరీ పరీక్ష నిర్వహణలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా అధికారులంతా పని చేయాలని అదనపు కలెక్టర్‌ ప్రతిమా సింగ్‌ సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల భవనంలోని సమావేశ మందిరంలో శుక్రవారం ఆమె ఈ నెల 9న నిర్వహించే గ్రూప్‌– ఐ ప్రిలిమినరీ పరీక్షకు సంబంధించి చేపట్టాల్సిన విధి విధానాలపై ఫ్లయింగ్‌ స్క్వాడ్‌, సిట్టింగ్‌ స్క్వాడ్‌, ఐడెంటిఫికేషన్‌ అధికారులు, శాఖాపరమైన అధికారులు, పరీక్ష నిర్వహణ పరిశీలకులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లాలో గ్రూప్‌–1 ప్రిలిమినరీ పరీక్ష నిర్వహణకు 93 కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. 55,692 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నట్లు తెలిపారు. రూట్‌ ఆఫీసర్లు, రీజనల్‌ కోఆర్డినేటర్స్‌, చీఫ్‌ సూపరింటెండెంట్స్‌, ఫ్లయింగ్‌ స్క్వాడ్‌ సిట్టింగ్‌ స్క్వాడ్‌ ఐడెంటిఫికేషన్‌ అధికారులు, లైజన్‌ అధికారులు పరీక్ష నిర్వహణలో తమకు కేటాయించిన విధులు పూర్తి బాధ్యతతో నిర్వర్తించాలన్నారు. పరీక్ష కేంద్రానికి అభ్యర్థులను ఉదయం 9 నుంచి 10 గంటల వరకు అనుమతించడం జరుగుతుందని, తరువాత వచ్చే వారిని అనుమతించరాదని సూచించారు.

విధులు సక్రమంగా నిర్వర్తించాలి

పరీక్ష రాసే అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విద్యుత్తు, టాయిలెట్స్‌, తాగునీరు ఉండే విధంగా అన్ని ఏర్పాట్లు చేసినట్లు అదనపు కలెక్టర్‌ తెలిపారు. రూట్‌ అధికారులు తమ లొకేషన్లను ముందస్తుగానే చూసుకోవాలని, శాఖ అధికారులు పరీక్ష కేంద్రాలను క్షేత్రస్థాయిలో వెళ్లి పర్యవేక్షించాలని తెలిపారు. ఐడెంటిఫికేషన్‌ అధికారులు అభ్యర్థి హాల్‌టికెట్‌, ఫొటోను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. చీఫ్‌ సూపరింటెండెంట్లు, ఇన్విజిలేటర్లు తమ విధులను సక్రమంగా నిర్వర్తించాలన్నారు. పూర్తి పోలీసు బందోబస్తు మధ్య పరీక్ష నిర్వహణకు చర్యలు తీసుకున్నట్లు వివరించారు. శిక్షణ కార్యక్రమంలో టీజీఎస్పీ రీజినల్‌ కోఆర్డినేటర్‌ గిరిధర్‌, సైబరాబాద్‌ ఏసీపీ మురళీకృష్ణ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

న్యాయం చేస్తారా.. చావమంటారా



యాచారం పోలీస్‌ స్టేషన్‌ ఆవరణలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన బిక్కు (నీలి రంగు చొక్కా)

- యాచారం పీఎస్‌ ఆవరణలో రైతు ఆత్మహత్యాయత్నం
- ఒంటిపై డీజిల్‌ పోసుకుని ఆందోళన
- కబ్జాలో ఉన్న భూమికి పాసు పుస్తకాలు ఇవ్వాలని డిమాండ్‌
- పోలీసులు, నాయకుల హామీతో శాంతించిన వైనం

యాచారం: 'ఏళ్లుగా కబ్జాలో ఉండి.. సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న భూమికి పట్టా ఇవ్వాలని తహసీల్దార్‌ కార్యాలయం చుట్టూ చెప్పులరిగేలా తిరిగినా న్యాయం జరగడం లేదు. తరచూ ఇతరులు మా భూమిలోకి వచ్చి కబ్జాకు ప్రయత్నిస్తున్నారు. న్యాయం చేయకపోతే చావే శరణ్యం'.. అంటూ ఓ రైతు యాచారం పోలీస్‌ స్టేషన్‌ ఎదుట ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. వివరాలివీ.. మంతన్‌గౌరెల్లికి చెందిన సభావట్‌ బిక్కు మంతన్‌గౌడ్‌ రెవెన్యూ పరిధి సర్వే నంబరు 71, 72లోని రెండెకరాలకు పైగా భూమిలో వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. తాను కబ్జాలో ఉన్న భూమికి సంబంధించి పట్టాదారు, పాసుపుస్తకాల కోసం కొన్నేళ్లుగా యాచారం తహసీల్దార్‌ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేకుండాపోయింది. ఇటీవల గ్రామానికి చెందిన ఓ వర్గం రైతులు బిక్కు కబ్జాలో ఉన్న భూమికి సంబంధించిన హక్కులు తమవేనని, ఇందుకు సంబంధించి తమ వద్ద పాసుపుస్తకాలు ఉన్నాయంటూ కబ్జాకు యత్నించారు. దీంతో బిక్కు పలుమార్లు తహసీల్దార్‌, పోలీస్‌ స్టేషన్లలో ఫిర్యాదు చేశాడు. అధికారుల నుంచి స్పందన కనిపించకపోవడంతో శుక్రవారం మధ్యాహ్నం యాచారం పోలీస్‌ స్టేషన్‌కు వచ్చాడు. న్యాయం చేస్తారా.. చావమంటారా అంటూ తనతో తెచ్చుకున్న డీజిల్‌ను ఒంటిపై పోసుకున్నాడు. ఇది గమనించిన పోలీసులు బిక్కును అడ్డుకున్నారు. విషయం తెలిసిన పలువురు నాయకులు అక్కడికి చేరుకున్నారు. న్యాయం జరిగేలా చూస్తామని పోలీసులు, నాయకులు హామీ ఇవ్వడంతో బిక్కు ఇంటికి వెళ్లాడు.

'ఫిట్‌'గా ఉండాల్సిందే..

- బడి బస్సులకు ఫిట్‌నెస్‌ మస్ట్‌
- విధిగా పరీక్షలు చేయించాలి
- లేకుండా తిరిగితే చట్టరీత్యా చర్యలు
- తేల్చి చెప్పిన రవాణా శాఖ అధికారులు



ఫిట్‌నెస్‌ టెస్ట్‌ కోసం షాద్‌నగర్‌ ఉప రవాణా శాఖ కార్యాలయానికి వచ్చిన పాఠశాల బస్సులు (ఫైల్‌)

షాద్‌నగర్‌: మరికొద్ది రోజుల్లో పాఠశాలలు ప్రారంభం కానున్నాయి. ప్రైవేటు పాఠశాలల విద్యార్థులను బస్సుల్లో ఇంటి నుంచి తీసుకెళ్లి సాయంత్రం తిరిగి చేరుస్తుంటారు. ఈ పాఠశాల బస్సుల ఫిట్‌నెస్‌ను ఎప్పటికప్పుడు పాఠశాల యాజమాన్యాలు పర్యవేక్షించాలి. పాఠశాలలు ప్రారంభమయ్యేనాటికి ఫిట్‌నెస్‌ పరీక్షలు చేయించుకొని ధ్రువపత్రాలు పొందాల్సి ఉంటుంది. జిల్లాలో సుమారు రెండువేల వరకు ప్రైవేటు పాఠశాలల బస్సులు ఉన్నాయి. ఫిట్‌నెస్‌ ఉంటేనే రోడ్లపై తిరగాలని లేకుంటే సీజ్‌ చేస్తామని రవాణా శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు.

ప్రత్యేకంగా బస్సుల ఏర్పాటు

ప్రవేటు విద్యాసంస్థల యాజమాన్యాలు పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచుకునేందుకు ప్రయత్నిస్తుంటాయి. ఈ క్రమంలో పట్టణ, గ్రామాల నుంచి విద్యార్థులను తీసుకొచ్చేందుకు బస్సు సౌక్యరం కల్పిస్తున్నాయి. ఇందుకు గాను ప్రత్యేకంగా రవాణా చార్జీల పేరిట వసూలు చేస్తున్నాయి.

పాటించాల్సిన నిబంధనలు

- పాఠశాల బస్సు 15 ఏళ్ల కాలపరిమితి దాటకూడదు.
- విద్యాసంస్థల బస్సులు పసుపు రంగులోనే ఉండాలి.
- బస్సు నడిపే డ్రైవర్‌కు విధిగా హెవీ వెహికిల్‌ లైసెన్సు ఉండాలి. డ్రైవర్‌ వయస్సు 60 ఏళ్ల లోపు ఉండాలి. బస్సు నడిపేందుకు ఐదేళ్ల అనుభవం ఉండాలి.
- బస్సుపై కుడి, ఎడమ వైపు పాఠశాల పేరు, చిరునామా స్పష్టంగా రాయాలి.
- వాహనం ఆగితే బ్లింక్‌ అయ్యేలా పై భాగంలో నాలుగు వైపులా అంబర్‌ లైట్లు ఉండాలి.
- డ్రైవర్‌ లైసెన్సును పాఠశాల యాజమాన్యం ఆర్‌టీఏ కార్యాలయంలో అందించాలి
- బస్సులో ప్రథమ చికిత్స పెట్టె, మంటలను ఆర్పే వ్యవస్థ ఉండాలి.
- కిటికీలకు అడ్డంగా మూడు కడ్డీలు ఉండాలి.
- నేల నుంచి 325 మి.మీ ఎత్తులో మెట్లు, ఎక్కేందుకు హ్యాండ్‌ రెయిలింగ్‌ ఉండాలి.
- అత్యవసర ద్వారంతోపాటు బస్సు డ్రైవర్‌, అటెండర్‌ ఫోన్‌ నంబర్లు ఉండాలి.
- నెలకోసారి బస్సు డ్రైవర్‌కు బీపీ, షుగర్‌, కంటి పరీక్షలను చేయించాలి.
- ప్రతి బస్సులో సీరియల్‌ నంబర్‌తో కూడిన ఫిర్యాదుల పుస్తకాన్ని అందుబాటులో ఉంచాలి.
- టీఎస్‌ స్కూల్‌ యాప్‌ ద్వారా విద్యా సంస్థ పేరు, డ్రైవర్‌, అటెండర్‌ పేరు వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసి స్కూల్‌ యాప్‌లో పొందుపర్చాలి.

ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు



ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి పాఠశాల బస్సుకు విధిగా ఫిట్‌నెస్‌ టెస్ట్‌ చేయించుకోవాలి. ఫిట్‌నెస్‌ లేకుండా పాఠశాల బస్సులు రోడ్ల పై తిరిగితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠినంగా వ్యవహరిస్తాం.

– వాసు , ఎంవీఐ, షాద్‌నగర్‌

చేప ప్రసాదానికి వేళాయె

- నేడు, రేపు నాంపల్లి ఎగ్జిబిషన్‌ గ్రౌండ్‌లో పంపిణీ
- ఏర్పాట్లను పరిశీలించిన అధికారులు
- వేలాదిగా చేరుకున్న ఆస్తమా బాధితులు



చేపప్రసాదం కోసం వివిధ ప్రాంతాల నుంచి వచ్చి నిరీక్షిస్తున్న జనం

గన్‌ఫౌండ్రీ/చార్మినార్‌/దూద్‌బౌలి: మృగశిర కార్తెను పురస్కరించుకుని నాంపల్లి ఎగ్జిబిషన్‌ గ్రౌండ్‌లో బత్తిని కుటుంబం ఆధ్వర్యంలో శని, ఆదివారాల్లో చేప ప్రసాదం పంపిణీ చేసేందుకు అంతా సిద్ధం చేసినట్లు బత్తిని హరినాథ్‌, బత్తిని అమర్నాథ్‌ గౌడ్‌ తెలిపారు. కాగా.. శుక్రవారం ఉదయం చేప ప్రసాదం తయారీ కోసం దూద్‌బౌలిలోని తమ స్వగృహంలో ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు చెప్పారు. ఈ క్రమంలో శుక్రవారం మత్స్యశాఖ, జీహెచ్‌ఎంసీ, పోలీస్‌ తదితర శాఖల అధికారులు ఎగ్జిబిషన్‌ గ్రౌండ్‌లో ఏర్పాట్లను పరిశీలించారు. 2 లక్షల చేప పిల్లలను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. మొత్తం 32 కౌంటర్లను ఏర్పాటు చేశామన్నారు. రూ.40 చొప్పున చేప పిల్లల టోకెన్‌ ధర నిర్ణయించారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున వచ్చే ఆస్తమా రోగులు, వారి సహాయకులకు స్వచ్ఛంద సంస్థలు భోజన వసతులు ఏర్పాటు చేశాయి. ఈ ఏడాది సుమారు 5 లక్షల మంది వస్తారని అంచనా వేస్తున్నారు. చేప ప్రసాదం పంపిణీ శనివారం ఉదయం 11 గంటలకు ప్రారంభమై ఆదివారం ఉదయం 6 గంటల వరకు నిర్విరామంగా కొనసాగుతుంది. ఇందుకోసం 300 మంది బత్తిని కుటుంబ సభ్యులు, వలంటీర్లు విడతల వారీగా విధుల్లో ఉంటారు. చేప ప్రసాదం కార్యక్రమ ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి రేవంత్‌ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్‌ ఆహ్వానించినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. కాగా.. ఇప్పటికే ఎగ్జిబిషన్‌ గ్రౌండ్‌కు ఆస్తమా బాధితులు తరలివచ్చారు.

ట్రాఫిక్‌ ఆంక్షలు..

చేప ప్రసాదం పంపిణీ సందర్భంగా నాంపల్లి ఎగ్జిబిషన్‌ గ్రౌండ్‌ పరిసర ప్రాంతాల్లో పోలీసులు ట్రాఫిక్‌ ఆంక్షలు విధించారు. గృహకల్ప, గగన్‌ విహార్‌ల వద్ద తమ వాహనాలను పార్క్‌ చేసి గేట్‌నెం. 2 ద్వారా ఎగ్జిబిషన్‌ గ్రౌండ్‌లోకి చేరుకోవాలని సూచించారు. వీఐపీలకు గేట్‌నెం.1 నుంచి ప్రవేశం కల్పించారు.

అధిక ధరలకు విత్తనాల విక్రయం

దుకాణ యజమానిపై కేసు



శ్రీసాయి సీడ్స్‌లో పత్తి విత్తనాల ప్యాకెట్లను సీజ్ చేస్తున్న అధికారులు, పోలీసులు

చేవెళ్ల: అధిక ధరలకు విత్తనాలు విక్రయిస్తున్న ఓ దుకాణ యజమానిపై పోలీసులకు కేసు నమోదు చేశారు. ఈ ఘటన మండల పరిధిలోని ఎన్కేపల్లి చౌరస్తాలో శుక్రవారం చోటు చేసుకుంది. సీఐ లక్ష్మారెడ్డి తెలిపిన ప్రకారం.. స్థానిక శ్రీసాయి ఏజెన్సీ సీడ్స్, ఫర్టిలైజర్ దుకాణ యజమాని లక్ష్మారెడ్డి పత్తి విత్తనాలు అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు వ్యవసాయాధికారులకు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో మండల వ్యవసాయాధికారి తులసి రైతుల నుంచి వివరాలు సేకరించారు. ఎమ్మార్పీ రూ.860 ఉన్న పత్తి విత్తనాల ప్యాకెట్‌ను రూ.1,200కు అమ్ముతున్నట్లు గుర్తించిన ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. తనిఖీల్లో ఆయన రూ.120 వెచ్చించి పత్తి విక్రయాలు చేస్తున్నట్లు రశీదులు అభ్యమయ్యాయి. దీంతో దుకాణం యజమానిపై కేసు నమోదు చేశామన్నారు.

విద్యుదాఘాతంతో పాడి ఆవులు మృతి



షాబాద్: విద్యుదాఘాతంతో మృతి చెందిన పాడి ఆవులు



కేశంపేట: వానరానికి చికిత్స చేస్తున్న పశువైద్య సిబ్బంది

షాబాద్: విద్యుదాఘాతంతో రెండు పాడి ఆవులు మృత్యువాత పడ్డాయి. ఈ ఘటన మండల పరిధిలోని మన్‌మర్రి శివారులో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన ప్రకారం.. మన్‌మర్రి గ్రామానికి చెందిన పొట్టిగారి నర్సింలుకు చెందిన పాడి ఆవులు మేత మేస్తూ పాఠశాల సమీపంలోకి వెళ్లాయి. అక్కడున్న విద్యుత్ స్తంభం వద్ద ఉన్న వైర్లు ప్రమాదవశాత్తు ఆవుకు తగిలాయి. దీంతో రెండు ఆవులు విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృత్యువాతపడ్డాయి. మృతి చెందిన ఆవుల విలువ సుమారు రూ.2లక్షలు ఉంటుందని పశుపోషణ చేసుకుంటున్న తనను ప్రభుత్వమే ఆదుకోవాలని రైతు కోరుతున్నాడు.

వానరానికి విద్యుత్ షాక్

కేశంపేట: గ్రామంలో తిరుగుతున్న క్రమంలో ఓ వానరం విద్యుదాఘాతంతో అపస్మారక స్థితికి చేరుకుంది. ఈ ఘటన శుక్రవారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన ప్రకారం వానరం ఓ ఇంటి పై నుంచి మరో ఇంటి పైకి దూకుతున్న సమయంలో విద్యుత్‌షాక్ తగిలింది. దీంతో అపస్మారక స్థితికి చేరుకుంది. గుర్తించిన గ్రామస్తులు సాయిలు, హరికృష్ణ, బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధి శివాజీ సమీపంలోని పశువుల ఆస్పత్రికి తరలించారు. డాక్టర్ నివేదిత వానారాన్ని పరీక్షించి చికిత్స చేశారు. అనంతరం ఆమనగల్లు రేంజ్ అటవీశాఖ అధికారులకు కోతిని అప్పగించారు.

10న ఈజీఎస్ సదస్సు

యాచారం: గ్రామీణ ఉపాధి హామీ చట్టం రక్షణకు జూన్ 10న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పి.అంజయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన కొత్తపల్లి గ్రామంలో ఇందుకు సంబంధించిన కరపత్రాలకు ఉపాధి కూలీలకు పంచారు. ఈ సమావేశానికి మంత్రి సీతక్క, వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ కార్యదర్శి శివదాసన్, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జి.నాగయ్య, ఆర్.వెంకట్రాములు తదితరులు హాజరవుతున్నారని చెప్పారు. ఉపాధి కూలీలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలన్నారు.



ఆమనగల్లు: గౌరారంలో రోదిస్తున్న బాధిత కుటుంబ సభ్యులు



ఆమనగల్లు: సంకటోనిపల్లిలో..



కేశంపేట: సంగెంలో..

పిడుగుపాటుకు మూగజీవాలు మృత్యువాత

ఆమనగల్లు: మండల పరిధిలోని గౌరారం, సంకటోనిపల్లి గ్రామాల్లో శుక్రవారం పిడుగుపాటుకు మూడు ఆవులు మృత్యువాతపడ్డాయి. మధ్యాహ్నం కురిసిన వర్షానికి పిడుగులు పడడంతో గౌరారం గ్రామానికి చెందిన రైతు నిట్ట పర్వతాలు, దావ శ్రీనుకు చెందిన ఆవులు చనిపోయాయి. ప్రభుత్వమే తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

నాలుగు గొర్రెలు.. నాలుగు మేకలు

నందిగామ: మండల పరిధిలోని మామిడిపల్లిలో శుక్రవారం సాయంత్రం ఉరుములతో కూడిన వర్షం కురిసింది. అదే సమయంలో గ్రామానికి చెందిన బొద్దుల శంకరయ్య తన జీవాలను చెట్టుకిందకు చేర్చాడు. ఒక్కసారిగా పిడుగు పడటంతో నాలుగు గొర్రెలు, నాలుగు మేకలు మృత్యువాత పడ్డాయి. జీవాలను సాదుకుంటూ జీవనం సాగించే శంకరయ్య మృత్యువాత పడడంతో ప్రభుత్వమే తనను ఆదుకోవాలని వేడుకుంటున్నాడు.

సంగెం శివారులో ఆవు

కేశంపేట: పిడుగుపాటుకు ఆవు మృత్యువాత పడింది. ఈ ఘటన మండల పరిధిలోని సంగెం శివారులో శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన పుట్టోనిగూడెం కృష్ణయ్య వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. తాను పోషించుకుంటున్న పాడి ఆవు మృతి చెందడంతో నష్టపోయానని ప్రభుత్వమే తనను ఆదుకోవాలని రైతు కోరుతున్నాడు.



నందిగామ: మృత్యువాత పడిన జీవాలు



కొందుర్గు: ఆగిర్యాలలో..

ఆగిర్యాలలో మేతమేస్తూ..

కొందుర్గు: పిడుగుపాటుతో ఆవు మృతిచెందిన సంఘటన మండల పరిధిలోని ఆగిర్యాలలో చోటుచుకుంది. గ్రామస్తులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన ఎండి సుల్తాన్ ఆవు శుక్రవారం మధ్యాహ్నం పొలం వద్ద మేత మేస్తుండగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. వర్షం తగ్గాక వెళ్లిచూస్తే ఆవు మృత్యువాత పడింది. ఇటీవలే రూ.80 వేలు వెచ్చించి ఆవు కొనుగోలు చేశానని తనను ప్రభుత్వమే ఆదుకోవాలని బాధిత రైతు కోరాడు.



మల్కాపూర్ జెడ్పీహెచ్ఎస్‌లో మొక్క నాటుతున్న సత్యనారాయణరెడ్డి తదితరులు

పర్యావరణ పరిరక్షణ మన బాధ్యత

రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డు సభ్యుడు సత్యనారాయణరెడ్డి

చేవెళ్ల: పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యతని రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డు సభ్యుడు చింపుల సత్యనారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మండల పరిధిలోని మల్కాపూర్ జెడ్పీహెచ్ఎస్‌లో ఆయన మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ.. పెరుగుతున్న కాలుష్యంతో భూతాపం పెరిగి అనర్థాలు ఏర్పడుతున్నాయని ఇందుకు కారణం అడవులు అంతరించిపోవడమేనన్నారు. కాలుష్య నివారణకు ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. మండల పరిధిలోని ముడిమ్యాల, పలుగుట్ట, మల్కాపూర్, కేసారం, తోల్‌కట్ట తదితర గ్రామాల పరిధిలో విస్తరించి ఉన్న అటవీ ప్రాంతాన్ని సైతం మరింత పచ్చదనంతో పెంపొందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ముడిమ్యాల పీఏసీఎస్ చైర్మన్ గోనే ప్రతాప్‌రెడ్డి, ఎంపీటీసీల సంఘం మండల అధ్యక్షుడు బి.రవీందర్‌రెడ్డి, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, నాయకులు యాదిరెడ్డి, నరేందర్‌గౌడ్, అశోక్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పురన్దాస్, ఇంద్రసేనారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, నర్సింలు, రమేశ్‌గౌడ్, రమేశ్, జబ్బార్, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

ఎక్సైజ్ దాడుల్లో ఇద్దరి అరెస్ట్



బెల్లం పానకం ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు

ఆమనగల్లు: ఎక్సైజ్ పోలీసుల దాడుల్లో మూడు కేసులు నమోదు చేసి ఇద్దరిని అరెస్ట్ చేశారు. వివరాల ప్రకారం.. శుక్రవారం ఆమనగల్లు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కడ్తాల్, ఆమనగల్లు, తలకొండపల్లి, మాడ్గుల మండలాల పరిధిలోని గిరిజన తండాలు, గ్రామాల్లో ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఆమనగల్లు సీఐ బద్యానాద్ చౌహాన్ ఆధ్వర్యంలో పాతకోట తండా, రేకగుట్ట తండా, సూర్యానాయక్‌తండా, పొద్దురుతండా, హర్యానాయక్‌తండా, ఖర్కస్‌తండా, తలకొండపల్లిలో దాడులు నిర్వహించారు. తలకొండపల్లి మండలం పాతకోటతండాకు చెందిన కొర్ర రాములు వద్ద రెండు లీటర్ల నాటుసారా, కర్కస్‌తండాకు చెందిన కేతావత్ లక్ష్మణ్ వద్ద రెండు లీటర్ల నాటుసారాను పట్టుకుని కేసు నమోదు చేసుకుని అరెస్టు చేశారు. పాతకోటతండా గ్రామ సరిహద్దులో 160 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసి కేసు నమోదు చేశారు. వేర్వేరు కేసుల్లో పట్టుబడిన ఇద్దరిని తలకొండపల్లి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. ఈ దాడులలో ఆమనగల్లు ఎక్సైజ్ ఎస్ఐ అరుణ్‌కుమార్, హెడ్‌కానిస్టేబుల్ శంకర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ చంద్రశేఖర్, మహేశ్వరం, ఇబ్రహీంపట్నం ఎక్సైజ్‌పోలీస్ స్టేషన్ల సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు అందని రాయితీ

- సబ్సిడీ యంత్రాలు ఇవ్వకపోవడంతో ఇబ్బందులు
- పదేళ్లుగా ఒక్కో పథకానికి మంగళం
- పెట్టుబడులు పెరిగి ఇబ్బంది పడుతున్న అన్నదాతలు



మండల వ్యవసాయశాఖ కార్యాలయం

కడ్తాల్: రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని ప్రకటనలు గుప్పిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్షేత్రస్థాయిలో అందుకు తగిన చర్యలు తీసుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆధునిక వ్యవసాయానికి తగినట్లుగా సాంకేతిక పరికరాలు అందడం లేదని వాపోతున్నారు. పదేళ్లుగా రాయితీ పథకాలను ప్రభుత్వాలు ఒక్కొక్కటిగా అటకెక్కించాయని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో వ్యవసాయ శాఖ ద్వారా అందించే సబ్సిడీ పరికరాలు నేడు రైతులకు అందకపోవండంతో రైతుల ఆశలపై నీళ్లు చల్లినట్టుగా మారింది. వ్యవసాయ యాంత్రీకరణ పథకాలు ప్రభుత్వం పక్కకు పెట్టడంతో అన్నదాతల పరిస్థితి అధ్వానంగా మారింది. ఎనిమిదేళ్లుగా సబ్సిడీ పరికరాలు రాకపోవడంతో రైతుల పరిస్థితి ఇబ్బందిగా మారింది. కాంగ్రెస్ పాలనలోనైనా రైతులకు రాయితీపై వ్యవసాయ యంత్రాలు, పనిముట్లు అందజేయాలని రైతులు కోరుతున్నారు.

రైతులకు నిరాశ

ప్రస్తుతం కడ్తాల్ మండల పరిధిలో 24 గ్రామ పంచాయతీల్లో 14వేలకు పైగా రైతులు, సుమారు 33వేల ఎకరాలపైగా సాగు భూమి ఉంది. గతంలో వ్యవసాయశాఖ నుంచి రైతులకు ఉపయోగపడే పరికరాలను ప్రభుత్వం సబ్సిడీపై అందించేది. డ్రిప్ పరికరాలు, కేజీ వీల్స్, కల్టివేటర్, రోటోవేటర్, తైవాన్ స్ప్రేలు, నాగళ్లు, మినీ ట్రాక్టర్లు, టార్పాలిన్ కవర్లు తదితర వ్యవసాయ పనిముట్లను ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై అందజేసేవారు. ప్రస్తుతం ఆ పథకాలు ఏవీ లేకపోవడంతో రైతులు తీవ్ర నిరాశతో ఉన్నారు.

నిలిచిపోతున్న పథకాలు

వ్యవసాయశాఖ ద్వార రాయితీ పథకాలు ఒక్కొక్కటిగా నిలిచిపోతున్నాయి. 2006-07 నుంచే వ్యవసాయ పథకాలకు కోత పడుతూ వస్తోంది. రైతుకు ఉపయోగపడే నాగళ్లు, ఇతర పనిముట్లు 2014 నుండే నిలిచిపోయాయి. 2016-17 ఆర్థిక సంవత్సరం వరకు అందుబాటులో ఉన్న 10 నుంచి 12 రకాల పనిముట్లు, ఆ తర్వాత కనుమరుగయ్యాయి. యాంత్రీకరణ, రాయితీ పథకాలు ఒక్కొక్కటిగా నిలిచిపోతుండడం మరో వైపు మంజూరయ్యే యూనిట్లు నామమాత్రంగా ఉంటున్నాయి. రైతులకు నిత్యావసరంగా మారిన టార్పాలిన్ కవర్లు సైతం తగ్గించారు. కల్టీవేటరు, రోటోవేటర్, జాడే లేదు. వ్యవసాయ యాంత్రీకరణ పథకాలు యధావిధిగా కొనసాగించాలని రైతులు కోరుతున్నారు.

రైతుల ఇబ్బందులు తీర్చాలి



ప్రభుత్వం సబ్సీడీపై వ్యవసాయ యాంత్రీకరణ పనిముట్లు ఇవ్వాలి. ప్రభుత్వం ఎనిమిదేళ్లుగా పనిముట్లు అందక ఇబ్బంది పడుతున్నారు. ప్రైవేట్‌లో వ్యవసాయ యాంత్రీకరణ పనిముట్లకు ధరలు అధిక ఉండటంతో ఆర్థికంగా నష్టపోతున్నారు. ప్రభుత్వం రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని వ్యవసాయ పనిముట్లు సబ్సీడీపై అందించాలి.

– చేగూరి వెంకటేశ్, సింగిల్‌విండో డైరెక్టర్, కడ్తాల్

చర్యలు తీసుకోవాలి



ప్రభుత్వం సబ్సీడీపై అందజేసే పనిముట్లు నిలిచిపోడంతో ఇబ్బందులు పడుతున్నాం. మార్కెట్‌లో అధిక ధరలు పెట్టి కొనుగోలు చేయలేకపోతున్నాం. రైతులకు ఆసరాగా ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. రైతులకు సబ్సీడీపై వ్యవసాయ పనిముట్లను, యంత్రాలను రాయితీపై అందజేయాలి.

– నేజ్యానాయక్, రైతు, కొండ్రిగానిబోడ్‌తండా

వ్యవసాయ పనిముట్లు ఇవ్వండి



వానాకాలం సీజన్ ప్రారంభమవుతున్నందున సబ్సీడీపై వ్యవసాయ పరికరాలు అందజేస్తే రైతులకు ఆసరాగా ఉంటుంది.వ్యవసాయపరికరాల కోసం తీవ్రంగా ఇబ్బంది ఎదుర్కుంటున్నాం.ప్రైవేట్‌లోధరలు ఎక్కవగా ఉండడంతో పాటు,నాణ్యతగా ఉండటం లేదు.ప్రభుత్వం రైతు క్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ పనిముట్లు రాయితీపై సరఫరా చేయాలి.

– రాములుయాదవ్, రైతు, కడ్తాల్